క్లుప్తంగా...

'మధ్యాహ్నం'.. బిల్లులు రాక అయోమయం..

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకానగర్‌లో ఉన్న పలు ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వాధికారులు కేవలం అవసరమైన బియ్యాన్ని మాత్రమే సరఫరా చేస్తారని, కూరగాయలు, నూనె ఇతర వంట సామాగ్రితో పాటు గ్యాస్ తామే సమకూర్చుకుంటామని మధ్యాహ్న భోజనం వడ్డించే మహిళా పొదుపు సంఘాలు వారు తెలిపారు. వాటి బిల్లులను ప్రభుత్వం తర్వాత చెల్లిస్తోందని అన్నారు. అయితే ఆర్నెళ్లుగా జీతంతో పాటు ఈ బిల్లులు కూడా రాకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వడ్డీలకు తెచ్చి మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే సరుకులు కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్నెళ్లుగా బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే బిల్లులు ఇవ్వాలని కోరుతున్నారు.

నారాయణ స్కూల్‌లో బతుకమ్మ సంబురాలు



కుషాయిగూడ: కుషాయిగూడలోని నారాయణ స్కూల్‌లో బుధవారం బతుకమ్మ, దసరా శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరై సందడి చేశారు. అనంతరం దసరా పండగ విశిష్టతను తెలియజేసే విధంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, బతుకమ్మ ఆట పాటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు పండగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అపరంజిని తెలిపారు.

నూతన యూజీడీ నిర్మాణం



యూజీడీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ తాళ్లబస్తీలో నూతనంగా నిర్మిస్తున్న యూజీడీ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ పూర్తయిన తర్వాత, పాత యూజీడీ, ఓపెన్ నాలాల స్థానంలో నూతనంగా యూజీడీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బాబు, కిషోర్, లక్ష్మణ్, కార్తీక్, నర్సింగ్ పాల్గొన్నారు.

డా.సి.మాణిక్యాంబకు మహిళా సైంటిస్టు అవార్డు

ఉప్పల్: ఎన్‌జీఆర్ఐలో సైంటిస్టుగా పనిచేసే డా.సి.మాణిక్యాంబకు జియాలజి సొసైటీ ఆఫ్ ఇండియా ఫర్ 2023 సంవత్సరానికి మహిళా సైంటిస్టు అవార్డు దక్కింది.


5 నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నియామకం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా కీసర ఆర్డీఓ రాజేష్‌కుమార్, మల్కాజిగిరి ఎన్నికల అధికారిగా సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికుమార్, కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారిగా ఎస్డీసీ-ఎల్ఏ సైదులు, కూకట్‌పల్లి ఎన్నికల అధికారిగా మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్‌కుమార్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అభిషేక్ అగస్త్యను నియమించారు.

గుండ్లపోచంపల్లిలో ఎన్నికల్ కోడ్ బేఖాతర్..

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ విధించగా గుండ్లపోచంపల్లిలో మాత్రం ఎన్నికల పరివర్తనా నియమావళిని అధికారులు పాటించడం లేదు. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసి రెండు రోజులు అవుతున్నా అధికారులు మాత్రం ఇంకా మొద్దు నిద్రలోనే వ్యవహరిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని మినీ ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలతో పాటు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఎన్నికల్ కోడ్ సందర్భంగా ఎన్టీఆర్ వంటి విగ్రహాలకు ముసుగులు వేయాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. దాంతో పాటు పలు రాజకీయ పార్టీల జెండాలు ఎగురుతుండటంతో తమ మున్సిపాలిటీలో ఎన్నికల కోడ్ లేదా అని మున్సిపల్ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

మొత్తం ఓటర్ల సంఖ్య 5,10,187



ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగింది. వీటితో పాటు పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా భారీగానే పెరిగింది. ప్రస్తుతం తుది ఓటరు జాబితా ప్రకారం ఉప్పల్ నియోజకవర్గంలో 5,10,187 ఓటర్లు ఉండగా అందులో కాప్రా 2,97,175, ఉప్పల్ 2,13,012 ఓటర్లు ఉన్నారు. 2018 ఎన్నికల సమయంలో ఓటర్ల సంఖ్య 4,54,690 ఉన్నాయి. ఈసారి పురుష ఓటర్లు 2,65,493 ఉండగా మహిళా ఓటర్లు 2,44,657, ఇతరులు 37 మంది ఉన్నారు. వీరిలో సర్వీస్ ఓటర్లు 158 మంది ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తన నియమావళి
ఎన్నిల అధికారి అభిషేక్ అగస్త్యా

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన కారణంగా ఉప్పల్ ఎన్నికల అధికారి అభిషేక్ అగస్త్యా నిబంధనలు మరింత కఠినతరం చేశారు. రెండు రోజుల నుంచి ఉప్పల్ నియోజవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అంటించిన పోస్టర్లు, చిత్రపటాలను సైతం తొలగించారు. ఉప్పల్ ప్రధాన కూడళ్లలో, వీధుల్లో ఆయా పార్టీలు ఏర్పాటు చేసుకున్న పోస్టర్లు, గోడలపై రాసిన రాతలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. పోలీసులు అవుట్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ అగస్త్యా స్వయంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఉప్పల్‌లో ఎక్సైజ్, పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటించాలని, వాటిపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. డబ్బుల రవాణా, పంపిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సాధారణ ప్రజానీకం మద్యం, డబ్బుల పంపిణీపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సి-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి అప్‌లోడ్ చేసిన నిమిషాల్లోనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుంటారని సూచించారు.

జంగ్ తెలంగాణ 2023

9 ఏళ్ల నుంచి రాష్ట్రంలో అవినీతి పాలన



గడప గడప కార్యక్రమంలో వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించిన గడప గడపకు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరారెడ్డినగర్, ఆర్ఎన్ఎస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, పీఎన్ఆర్‌కాలనీ, రాజలింగం కాలనీల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి స్పందన లభించిదన్నారు. 9 ఏళ్ల నుంచి రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని, ఈ పాలనను అంతమొందించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. మల్లారెడ్డి హయాంలో బోడుప్పల్‌కు ఒక్క రూపాయి అభివృద్ధి చేయలేదన్నారు. పాదయాత్రలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు కొత్త సుశాంత్‌గౌడ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, కొత్త ప్రవంతిగౌడ్, తోటకూర అజయ్‌యాదవ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వం గుప్తా, నేతలు బొమ్మక్ రమేష్, కుర్రి శివశంకర్, ఆకుతోట గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా..

బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి బీఎల్ఆర్



మాట్లాడుతున్న బీఎల్ఆర్

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రతి డివిజన్‌లో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్ యాదవ సంఘంలో హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ బీపీ చారి, ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు ప్రతి డివిజన్‌లో గడప గడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, జహంగీర్, వెంకట్ రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఖాదీ ఉత్పత్తుల మేళా ప్రారంభం



స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కిషన‌రావు, డా.అరుణ్ కుమార్



దసరా, బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభిస్తూ..

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామం బతుకమ్మ, దసరా పండగను పురస్కరించుకుని బుధవారం స్టేట్ హ్యాండ్లూమ్ చేనేత ఖాదీ ఉత్పత్తుల మేళాను విశ్రాంత ఐఏఎస్ అధికారి జి.కిషన్‌రావు వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డా.అరుణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 14 రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి నేత కార్మికులు వచ్చి నేరుగా విక్రయించుకునేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నారాయణపేట, గద్వాల్, పోచంపల్లి, తస్సార్, కోట, బెంగళూరు సిల్క్, ఖాదీ షర్టులు, డ్రెస్ మెటీరియల్, బెడ్‌షీట్స్ తదితర వాటిని ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. నేత కార్మికులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చన్నారు. వినియోగదారులకు తక్కువ ధరల్లోనే లభిస్తాయన్నారు. జనరల్ మేనేజర్ అంజయ్య, ఏఈ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా, బతుకమ్మ వేడుకలు ప్రారంభం

ఉప్పల్ మినీ శిల్పారామంలో బుధవారం దసరా, బతుకమ్మ ఉత్సవాలను శిల్పారామం రూపశిల్పి కిషన్‌రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 14 రోజుల పాటు శిల్పారామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పండగ జరుపుకుంటున్నట్లు తెలిపారు. నాట్యగురువు అరుణ శ్రీనివాస్ శిష్య బృందంచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అనురాగ్ విద్యార్థికి రజితం

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఏఐఎంఎల్-ఎ రెండో సంవత్సరం చదువుతున్న రూపేశ్‌రెడ్డి ఇంటర్ గ్రూపు వాయు సైనిక క్యాంపు ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ అండ్ హైజీన్ పోటీల్లో రజిత పతకం గెలుచుకున్నాడు. ఏపీ, తెలంగాణ డీజీపీ ఏఐఆర్ కమాండర్ ఐఎం రెడ్డి పతకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో బుధవారం జరిగిన అభినందన సభలో డీన్, డాక్టర్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ సీటీఓ డాక్టర్ మల్లేశం, ఏఐ హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి, రఘు రజత పథక విజేత రూపేశ్‌ను అభినందించారు.

డీఎంహెచ్‌వోకు సత్కారం



ఉప్పల్: మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నియమితులైన డా.రఘునాథ్‌ను బుధవారం ఉప్పల్ పీహెచ్‌సీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. డీఎంహెచ్‌ఓను కలిసి వారిలో ఉప్పల్ వైద్యాధికారి డా.సౌందర్య లత, సూపరింటెండెంట్ బోగ ప్రకాశ్, సిగ్మతుల్లా తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



మర్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్ సర్కిల్ వెంకటాపురం కిరణ్ టాకీస్ లైన్‌లో ఉన్న మహిళా మండలి అధినేత్రి వీణ సుదేష్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు బీఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమానికి మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబితకిషోర్, అనీల్‌కిషోర్, కాలనీ అధ్యక్షులు రంగారావు, నేమూరి శ్రీధర్‌గౌడ్, విజయ, శేఖర్, ప్రభాకర్, సిద్ధయ్య, సంతోష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూల్స్ పాటించని వాహనదారులకు జరిమానా, జైలు



తనిఖీలు చేసిన ఇన్‌స్పెక్టర్ శివశంకర్

మల్కాజిగిరి: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి, నెంబర్ ప్లేట్స్ సరిగాలేని వారికి 5వ స్పెషల్ ఎంఎం కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించారని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. నెంబర్ ప్లేట్ సరిగాలేని ఒకరికి ఐదు రోజులు జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, ఇద్దరికి రెండు రోజులు జైలు శిక్ష రూ.2 వేల జరిమానా, ఒకరికి రూ.2 వేలు, మరొకరికి రూ.2,500లు జరిమానా విధించారన్నారు. మద్యం సేవించిన వారిలో ఐదుగురికి రూ.2 వేలు, ఆరుగురికి రూ.2,500లు, నలుగురికి రూ.3 వేలు, ముగ్గురికి రూ.3,500లు జరిమానా విధించారన్నారు. 23 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు



బ్యాంక్ కాలనీలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ..

అల్వాల్: మానసిక అనారోగ్యానికి గురైన వారికి చికిత్స అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు సేవలు అందిస్తున్నాయని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ ఆచార్య అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నేరేడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ సహకారంతో 15వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అవగాహన శిబిరంలో పాల్గొనాలని సూచించారు. బుధవారం బ్యాంక్ కాలనీలోని 500 మంది చెవిటి, మూగ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సైగల భాషతో విషయాన్ని చెప్పామన్నారు. కార్యక్రమంలో హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు పఠాన్ ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎస్ఏకు డాక్టర్ ప్రాంతిక్ మండల్

ఉప్పల్: ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్టు డా.ప్రాంతిక్ మండల్ ఫెలో ఆఫ్ ద ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి(ఏఎన్ఎస్ఏ)కు ఎంపికయ్యారు. భూకంపాలు, సిస్మాలజీ, భూపొరల్లో ఉండే ప్లేట్స్‌పై చేసిన పరిశోధనలకు గాను మండల్‌కు ఈ అవకాశం లభించినట్లు ఎన్‌జీఆర్ఐ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా వినోద్‌యాదవ్



వినోద్‌యాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మౌలాలి: కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షుడిగా పోతుల వినోద్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మల్కాజిగిరి నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్ వినోద్‌యాదవ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌యాదవ్ మాట్లాడుతూ.. మౌలాలిలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పదవి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీ-బ్లాక్ అధ్యక్షుడు వినోద్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చందాబాగ్ దర్గాలో మైనంపల్లి ప్రార్థనలు

మౌలాలి: మౌలాలిలో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై చందాబాగ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సాయినాథపురం ఆఫీసర్స్ కాలనీవాసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తనకు మద్దతు తెలపాలని, కాలనీ అభివృద్ధికి కృషి చేశారని, మరింత అభివృద్ధి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌యాదవ్, బీబీకే.శ్రీను, వినోద్‌యాదవ్, జీఎన్‌వీ.సతీష్‌కుమార్, షెడరేషన్ అధ్యక్షుడు చుంకు శ్రీనివాస్, సంతోష్ రాందాస్, శివాజీ, రాముయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మౌలాలి చందాబాగ్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

'దమ్ముంటే మైనంపల్లిని ఓడించండి'



మాట్లాడుతున్న వెంకటేష్‌యాదవ్

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ తల్లిలాంటిదని చెప్పిన నందికంటి శ్రీధర్ బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయి పదవి తెచ్చుకున్నాడని, పార్టీ నాయకులు, కార్యకర్తలను పార్టీలో చేరేలా ప్రలోభాలకు గురిచేస్తున్నారని బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ అన్నారు. మల్కాజిగిరిలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా నందికంటి శ్రీధర్ పార్టీని వీడితే పట్టుమని 20 మంది కూడా వెళ్లలేదంటే ఆయన కెపాసిటీ ఏమిటో అర్థమవుతోందన్నారు. ఇప్పటికీ దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న నిజాయితీ కలిగిన నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆదేశాలకు కట్టుబడి పనిచేస్తామన్నారు. మైనంపల్లి హన్మంతరావును ఓడించే సత్తా ఆయనకు లేదన్నారు. నందికంటి శ్రీధర్‌కు 2014లో డిపాజిట్ కూడా లేదన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉండే నాయకుడు మైనంపల్లి హన్మంతరావు వచ్చారని, మల్కాజిగిరి అభివృద్ధిలో ఆయన చెరగని ముద్ర వేశాడన్నారు. సమావేశంలో నాయకులు గౌస్, బీకే శ్రీనివాస్, సంపత్‌గౌడ్, ఉమేష్‌సింగ్, సానాది శంకర్, వినోద్ యాదవ్, శ్యామ్‌రావు, నాగరాజు, మహేందర్, కొండగౌడ్, రోజారమణి, ఆశ, నాగేష్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులూ.. బీకేర్ ఫుల్..

- ఎన్నికల్లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా ఉండాలి
- ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠినంగా వ్యవహరించాలి
- అధికారులతో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



పోలీసు ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఉప్పల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పొరపాట్లు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ డీసీపీ కార్యాలయంలో రాచకొండ పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలని సూచించారు. అందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద భద్రత ఉంచాలన్నారు. వీటితో పాటు ఎన్నికల విధుల్లో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వదంతులు సృష్టించే వారిపై, ఎక్కడైనా చిన్న గొడవలు జరిగినా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ల అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాయింట్ సీపీ అంబర్ కిషోర్, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ అభిషేక్ మహంతి, మల్కాజిగిరి డీసీపీ దారావత్ జానకీ, ఎస్‌వోటీ డీసీపీ గిరిధర్, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, డీసీపీ బాలస్వామి, సైబర్ డీసీపీ అనురాధ, అడ్మిన్ డీసీపీ ఇందిరా, ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కేసులతో హింసించిన ఘనత మైనంపల్లిదే..

బీజేవైఎం జాతీయ కోశాధికారి టీంసాయి



మాట్లాడుతున్న బీజేపీ శ్రేణులు

అల్వాల్: అధికారంలో ఉండగా బీజేపీ కార్యకర్తలపై పలు రకాలుగా కేసులు పెట్టి హింసించిన ఘనత ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకే దక్కుతుందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. బుధవారం నేరేడ్‌మెట్ డివిజన్‌లోని జీకే సరస్వతి ఫంక్షన్ హాల్‌లో బీజేవైఎం జాతీయ కోశాధికారి టీంసాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్, రాజ్యలక్ష్మీ, శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధిని అనగదొక్కడమే లక్ష్యంగా మైనంపల్లి పాలన చేశాడన్నారు. ఆయన 5 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండగా దళిత బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆయనకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకే ఇచ్చాడన్నారు. ఇప్పుడు పార్టీ మారగానే ప్రజలు గుర్తుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. మల్కాజిగిరి ప్రజలు బీజేపీవైపే మొగ్గు చూపుతున్నారన్నారు. మల్కాజిగిరి బీజేపీ నేతలు పార్టీ మారుతున్నారనే ప్రచారాన్ని వారు ఖండించారు. కార్యక్రమలో బీజేపీ సీనియర్ నేత వీకే.మహేష్, ప్రసన్న, జీకే.హన్మంతరావు, మధుసూదన్‌రెడ్డి, విఠోభా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.